క్లుప్తంగా

నిరుపేద మహిళకు ఆర్థిక సాయం


సుశీలకు సాయాన్ని అందజేస్తున్న ఎస్ఎస్ఎస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ మడ్డివీధిలో నివాసం ఉంటున్న కలివరపు సుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈమె వైద్యానికి స్మాల్ సర్వీస్ టు సొసైటీ (ఎస్ఎస్ఎస్), ఎలియన్స్ క్లబ్ మిత్ర సభ్యులు అండగా నిలిచారు. రూ.32 వేలు నగదుతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు సుశీలకు శనివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

మహిళా హోంగార్డులకు చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా హోంగార్డు యూనిట్‌లో పని చేస్తున్న మహిళా హోంగార్డులకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తన చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. దుర్గాదేవి అమ్మవారి నవరాత్రుల వేడుకల్లో భాగంగా నానుబాలు వీధిలో కొలువైన విజయదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు ఆరవిల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఊర్వశి సిల్క్స్ అధినేత దేవరశెట్టి ప్రదీప్, కాంచన లతల సౌజన్యంతో 91 మంది మహిళా హోంగార్డులకు చీరలను అందజేశారు. మహిళా హోంగార్డులకు చీరలందించిన ఊర్వశి సిల్క్స్ వారిని ఎస్పీ అభినందించారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు పలువురికి బదిలీ అయింది. వీరు రిలీవ్ ఆర్డర్లు శనివారం తీసుకొని బదిలీ అయిన ప్రాంతాలకు వెళ్లారు. ఈ ప్రాంతాలకు కొత్తవారు వచ్చి చేరుతున్నారు. మండలంలో 28 గ్రామ సచివాలయాలు ఉండగా 13 మంది గ్రామ కార్యదర్శులకు, 15 మంది డిజిటల్ అసిస్టెంట్లకు, 9 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు బదిలీ అయింది. రాజకీయ మద్దతులేని వారికి దూర ప్రాంత గ్రామాలకు బదిలీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సత్కారం


నిశ్చలను సత్కరిస్తున్న కార్యదర్శులు

జి.సిగడాం: స్థానిక ఎంపీడీఓ పనిచేసి డిప్యుటేషన్‌పై డీపీఆర్సీకి వెళ్తున్న కె.నిశ్చలకు శనివారం పంచాయతీ కార్యదర్శులు సత్కరించారు. ఈ సందర్భంగా నిశ్చల మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో జి.సిగడాం మండలం అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉండేలా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తులసీప్రసాద్‌సాహు, పొటాన్రు సురేష్, ఏర్నేన జ్యోతిశ్రీనివాసరావు, ధర్మవరపు సతీష్, చేబ్రోలు సురేష్‌కుమార్, హరి, గార వైదేహి, లుకలాపు ఉషారాణి, పాగిరి రాము తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు


జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, తదితరులు

రణస్థలం: మండలంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిగ్రీ కళాశాలను ప్రారంభించడానికి ఫీజుబిలిటీ సర్వే రిపోర్టు తయారు చేయాలని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చిందని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. కొండములగాం ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అధ్వర్యంలో శనివారం పరిశీలించారు. కొత్త విద్యా సంవత్సరంలో క్లాసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎన్.ప్రసాద్, మండల సర్వేయర్ రవి, కుటమి నాయకులు పాల్గొన్నారు.

విజయదుర్గకు ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదుర్గకు శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నానుబాల వీధిలో గాయత్రిమాతగా, షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో అన్నపూర్ణదేవిగా, బాకర్ సాహెబ్ పేట దుర్గామహాలక్ష్మి ఆలయంలో గాయత్రీ మాతగా అలంకరించారు.

• సాగునీటికి తిప్పలు..


కాలువలో అడ్డంకులను తొలగిస్తున్న రైతులు

ఎచ్చెర్ల కాంపస్: నారాయణపురం కుడి కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించటంలో ప్రభుత్వం, అధికారులు చేతులెత్తేశారు. పొట్ట దశలో వరి పంట ఉంది. దీంతో పంటను కాపాడుకోవడానికి రైతులు పాట్లు పడుతున్నారు. సంతకవిటి, పొందూరు మండలాల పరిధిలో కాలువల్లో అడ్డంకులు తొలగిస్తూ సాగునీరు కిందకు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ సాగునీరు అందరి పరిస్థితి నెలకొంది. సమస్యను నీటిపారుదలశాఖ ఏఈ కె.దాలయ్య దృష్టికి రైతులు తీసుకెళ్లారు.

• ప్రహరీపై పిచ్చిమొక్కలు..


ప్రహరీపై పిచ్చిమొక్కలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ముందు ప్రహరీపై భారీగా పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రహరీ ముందు భాగంలో గతంలో గ్రిల్స్ సైతం పెట్టారు. ఈ గ్రిల్స్ రక్షణగా ప్రహరీని ఆనుకొని మొక్కలు పెంచాలని భావించారు. ప్రస్తుతం నిర్వహణ లేక పోవటంతో పిచ్చి మొక్కలు ఆవరించాయి. గిల్స్ కంచె సైతం తుప్పుపడుతుంది.

• వెంకన్నకు పూజలు


నారాయణ తిరుమలలో పూజలందుకున్న స్వామివారు


చిన్నబజారులో తులసిమాల అలంకరణలో వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్‌బాగ్‌పేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. వెంకట రామానుజ సేవాశం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో శ్యామలరావు ఏర్పాట్లు చేశారు.

తులసిమాల అలంకరణ

చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామికి పూలు, తులసి మాలలతో అలంకరణలు చేశారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి



రామతీర్థాల కూడలిలో ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అందరికీ ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం నాయకుడు వెలమల రమణ అన్నారు. మండల కేంద్రంలోని రామతీర్థాల కూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో భవన కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ అవినీతిని అరికట్టి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని కోరారు. భవన నిర్మాణాలు చేసుకునే వారిపై అధిక భారం లేకుండా చూడాలన్నారు. వంద రోజుల పాలనలో ఇసుక విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడం వల్ల ఇసుక కొరత తీవ్రతరమైందన్నారు. అనేకచోట్ల ఇసుక లభించడం లేదని, రవాణా చార్జీలు అధికమౌతున్నా.. ఇసుక దొరకడం లేదన్నారు. ఇసుక కొరత వల్ల ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, మధ్య తరగతి వర్గాలపై భారం పడుతుందని వివరించారు. ఇసుకను అందజేసేందుకు ఆన్‌లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని ప్రకటించినా.. ప్రభుత్వ ప్రకటనలకు, హామీలకు, ఆచరణకు పొంతనలేదన్నారు. ధరల్లో తీవ్ర వ్యత్యాసం కనబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు ఇజ్జురోతు రమణ, భవన నిర్మాణ కార్మికులు పి.చిన్న, పి.రామకృష్ణ, గొర్లె అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గార:మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మహిళలకు న్యాయ అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహహింస, అత్యాచారాలు, ఉద్యోగ వేధింపులు, మహిళా రక్షణ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సందర్భాల్లో అవసరమైన మహిళలకు న్యాయ సహాయం అందించేందుకు న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ సీడీపీవో బి.శాంతిశ్రీ, డీసీపీవో కె.రమణ, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, సీడీపీవో రాధామాధవి ఉన్నారు.

మెమో రద్దుపై హర్షం


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం: మండలంలోని గొల్లపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గంపా రమేష్‌పై గత నెల 17న ఎంఈఓ ఎ.త్రినాథరావు మెమో జారీ చేశారు. ఈ మెమోను ఎంఈఓ రద్దు పరిచినందున ఏపీటీఎఫ్, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఆపస్, ఎస్‌జీటీఎఫ్, బీటీఏ, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు రణస్థలం ఎంఈఓ కార్యాలయంలో శనివారం సమావేశమై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు, విద్యా సంబంధిత సమస్యల పరిష్కారించాలని ఎంఈఓ త్రినాథరావుకు వినతి పత్రం అందజేశారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అండగా..


నిత్యావసర సరుకులతో ఔట్‌సోర్సింగ్స్ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: విజయవాడ వరదల్లో చిక్కుకున్న ఆర్టీసీ ఔట్‌సోరింగ్ కార్మికులు సుమారు 80 మందికి శ్రీకాకుళంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అండగా నిలిచారు. నిత్యావసర సరుకులను సేకరించి శుక్రవారం రాత్రి ప్రత్యేక బస్సులో విజయవాడకు పంపించారు. ఈ సందర్భంగా జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.ముత్యాలరావు, జిల్లా అధ్యక్షులు డి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా కమిటీ అధ్యక్షులతో పాటు కమిటీ సభ్యులు, కార్మికులు అందరి సహకారంతో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు ఇచ్చి వారికి ఇతోధికంగా సహకరించాలనే ఆలోచనతో ముందడుగు వేశామన్నారు. ఈ సహాయ కార్యక్రమానికి రవాణా సౌకర్యాన్ని అందించిన శ్రీకాకుళం జిల్లా డీపీటీవో ఎ.విజయ్‌కుమార్, శ్రీకాకుళం-1 డిపో డీఎం అమరసింహుడు, శ్రీకాకుళం-2 డిపో డీఎం శర్మ ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ, జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ, జిల్లా సెక్రెటరీ త్రినాథ్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న హరికథ


హరికథ ప్రదర్శన ఇస్తున్న కాళ్ల నిర్మల

శ్రీకాకుళమ కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో రంగస్థలకళ కళాకారుల 300వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా హరికథ ప్రదర్శన శనివారం జరిగింది. ఈ సందర్భంగా విజయనగరం పట్టణానికి చెందిన హరికథా చూడామణి కాళ్ల నిర్మలచే 'రుద్రాక్ష మహిమ' కథను చక్కగా ప్రదర్శించారు. వీరికి వయోలిన్‌పై దుంపల ఈశ్వరరావు, మృదంగంపై రాయల మోహనరావులు సహకరించారు. ముందుగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ.. ప్రతినెల ఒక కార్యక్రమం నిర్వహిస్తు కళాకారులకు ఆదర్శంగా సంస్థ నిలుస్తోందన్నారు. అనంతరం ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన నటులు ఎల్.రామలింగస్వామిని, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజల్ వాసుదేవాచారిని ఘనంగా సత్కరించారు. చిట్టి వేంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పేద కళాకారులకు పింఛన్లు అందచేశారు. కార్యక్రమంలో గాయత్రీ కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, కూన రాజారావు, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్ పాల్గొన్నారు

నేడు ఐదు హైర్ బస్సులు ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఐదు కొత్త హైర్ బస్సులను ఆదివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు హాజరుకానున్నాయి. శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో మూడు కొత్త హైర్ బస్సులు, శ్రీకాకుళం రెండవ డిపో పరిధిలో రెండు కొత్త హైర్ బస్సులు ప్రారంభించనున్నారు. బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మలు కోరారు.

స్వర్ణ కిరీటానికి రూ.50 వేల విరాళం


విరాళం మొత్తం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:

స్థానిక డీసీసీబీ కాలనీలోని భూ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కొలువైన వెంకటేశ్వరస్వామికి బంగారు కిరీటం చేయించే నిమిత్తం మామిడి ధర్మారావు దంపతులు రూ. 50 వేలు విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని శనివారం అందించారని ఆలయ అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


మొక్కలు పరిశీలిస్తున్న పీడీ శాంతిశ్రీ

గార: బోరవానిపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలోని ప్రీ స్కూల్ చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంతో పాటు నేర్చుకుంటున్న అంశాలను పరిశీలించారు. ఆవరణలో న్యూట్రీ గార్డెన్‌లో బెండ, బీర, అరటి వంటి మొక్కల పెంపకాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సీడీపీవో రాధామాధవి, సూపర్‌వైజర్ ప్రసన్న ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా పద్మావతి


బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మావతి

గార: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా డి.పద్మావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు కోటబొమ్మాళి మండలానికి బదిలీ అయ్యారు. ఐదు సంవత్సరాలుగా పనిచేసిన ప్రసాదరావును రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర, వీఆర్‌వోలు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ


రామకృష్ణ

జి.సిగడాం: స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓ (ఈఓపీఆర్డీ)గా గుంటముక్కల రామకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నరసన్నపేట ఈఓపీఆర్డీగా పని చేసి ఇక్కడకు ఈఓపీఆర్డీగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు ఎల్.ఎన్.పేటకు బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓగా పని చేసిన కె.నిశ్చల డీపీఆర్సీకి డిప్యుటేషన్‌పై వెళ్లారు.

హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈఈగా యువరాజ్


యువరాజ్

జి.సిగడాం: మండలం గృహనిర్మాణశాఖ ఇన్‌చార్జి ఏఈఈగా గొల్లంకి యువరాజ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎం.రమేష్ లావేరు మండలానికి బదిలీపై వెళ్లారు.

ఈఓపీఆర్డీగా..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ ఈఓపీఆర్డీగా బత్తుల మల్లేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. టెక్కలి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కె.ఈశ్వరి టెక్కలికి బదిలీ అయ్యారు.

విధుల్లో చేరిక..

పలువురు రెవెన్యూ అధికారులు ఎచ్చెర్ల తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డీటీగా బలగ గోపాల్, సీనియర్ అసిస్టెంట్‌గా కృష్ణవేణి, ఆర్ఐగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట గ్రామం వద్ద ఉన్న అనధికార ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను జాతీయ రహదారిపై ఆ గ్రామ సమీపంలో ఎచ్చెర్ల పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

7, 8 తేదీల్లో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీరాజ్ చట్టాలు, విధులు, బాధ్యతలు తదితర అంశాలపై ఈ నెల 7, 8 తేదీల్లో ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీపాన హరిహరరావు శనివారం తెలిపారు. మండలంలో 26 పంచాయతీలకు సంబంధించి ఉపసర్పంచ్‌లు, ఇద్దరు వార్డు సభ్యులకు ఈ శిక్షణ ఉంటుందన్నారు.

భైరివానిపేటలో కుక్కల స్వైర విహారం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరపరిధిలోని 50వ డివిజన్ భైరివానిపేటలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నాలుగు వీధుల్లో సుమారు నలభై కుక్కలు తిరుగుతూ గ్రామస్తులకు నిద్రాహారాలు లేకుండా చేస్తున్నాయి. నాలుగు రోజుల కిందట ఓ పిచ్చి కుక్క ఇద్దరిని కరవడంతో గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ట్రాఫిక్ ఇక్కట్లు


ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ రోడ్డులో ఉన్న ఆస్పత్రులు, హోటళ్లు, ప్రయివేటు కాలేజీలు, బ్యాంక్‌లు, షాపులకు ఎటువంటి పార్కింగ్ స్థలాలు లేవు. ఒకటి రెండు చోట్ల ఉన్నా సిబ్బంది వాహనాలు పెట్టుకునేందుకే సరిపోతున్నాయి. ఇక కొందరు పండ్ల వ్యాపారులు, తోపుడు వ్యాపారులు రోడ్లపైనే బండ్లు పెట్టేయడం, హోటల్స్‌కి భోజనానికి వచ్చేవారి ద్విచక్ర వాహనాలు సైతం రహదారిపైనే పెట్టేస్తున్నారు. దీంతో ఆస్పత్రులకు అత్యవసర పరిస్థితుల్లో వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన ట్రాఫిక్ సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఎస్పీ స్పందించి ట్రాఫిక్ సమస్య నుంచి విముక్తి కలిగించాలని పలువురు కోరుతున్నారు

సాగు విధానం మారాలి


మాట్లాడుతున్న రణస్థలం ఏడీఏ శ్రీనివాసరావు

రణస్థలం: ప్రస్తుతం వాతారణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని రణస్థలం డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు అన్నారు. పైడిభీమవరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం బెంగళూరుకు క్లెమ్స్, ఈక్విలిబ్రియం, వెర్రా సంస్థలు సంయుక్తంగా స్థానిక రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో భాగస్వామ్య సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వాతారణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు విధానం మారాలని సూచించారు. అనంతరం విజయనగరం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.లక్ష్మణ, సస్యపోషణ శాస్త్రవేత్త ఎం.ఎం.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంప్రదాయ వ్యవసాయ విధానాల వల్ల వాతావరణంలో అధిక కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయని, దీనిని తగ్గించాలంటే తక్కువ నీటి వినియోగంతో సాగు చేస్తూ ఏడాది పొడువునా భూమిని కప్పి ఉంచేలా పంటలు పండించాలన్నారు. ఆమదాలవలస వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త జి.చిట్టిబాబు మాట్లాడుతూ కూలీల కొరతతో సాగు భారమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పరిశోధన స్థానాల్లో నిరూపించబడిన అధునాతన సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస శాస్త్రవేత్త ఎస్.కిరణ్ కుమార్, క్లెమ్స్, ఈక్విలిబ్రియం సంస్థల ప్రతినిధులు పంకజ్, యష్, పర్యావరణ కార్యాచరణ ప్రతినిధి ఆర్.హరిబాబు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు

రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు ఇదే

- 16, 17, 18 తేదీల్లో జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలు
- 7వ తేదీ నుంచి నెల్లూరులో శిక్షణ శిబిరం

జే.పంగులూరు: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలికల జట్టును ఎంపిక చేశారు. శనివారం పంగులూరులోని స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 విభాగంలో రాష్ట్ర బాలికల ఖోఖో జట్టు ఎంపిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూల నుంచి 100 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. మంచి ప్రతిభకనబరిచిన బాలికలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికైన రెండు జట్లు ఈనెల 16,17,18 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి ఈనెల 7వ తేదీ నుంచి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఎంపికలో రాష్ట్ర రిఫరీస్ బోర్డ్ కన్వీనర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ (కృష్ణా జిల్లా), బాపట్ల కోచ్ జే పాల్, ప్రకాశం జిల్లా కోచ్ డీఎల్ లక్ష్మినారాయణరెడ్డి, కడప జిల్లాకు చెందిన పీడీ ఎం పవన్‌కుమార్, సోమేశ్వరరావు (కృష్ణా జిల్లా), వి రఘుబాబు (ఇడుపులపాడు), సావిత్రమ్మ (కనిగిరి), లత (శ్రీకాకుళం), రత్తయ్య (కారంపూడి), శ్రీనివాసరావు, రాంబాబు, (తూర్పుగోదావరి), కే వీరాంజనేయులు, కె రామారావు (ముండ్లమూరు), సోమశేఖర్‌రెడ్డి (ఈదర)తదితరులు పాల్గొన్నారు.

అండర్ -14 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు..

కే భవాని (నెల్లూరు), షేక్ గౌస్య (నెల్లూరు), ఎం హారిక (శ్రీకాకుళం), ఎం యువశ్రీ (చిత్తూరు), జీ చందన (శ్రీకాకుళం), ఎం చందన లక్ష్మి (విజయనగరం), ఏ హేమలత (ప్రకాశం), బీ ఐశ్వర్య (ప్రకాశం), షేక్ మనీషా (గుంటూరు), జీ హరిత (కడప), పవిగనిలక్ష్మి (తూర్పుగోదావరి), ఎస్ హారిక (విజయనగరం), కావేరి (అనంతపురం), డీ వినేష్ (కృష్ణా), హారిక (కర్నూలు), జీ గురవమ్మ (ప్రకాశం).

అండర్-17 విభాగంలో రాష్ట్ర ఖోఖో బాలికల జట్టు..

కేకే ప్రీతి (నెల్లూరు), ఎస్ శ్రవంతి (నెల్లూరు), ఆర్ జాహ్నవి (విజయనగరం), ఏ పురందేశ్వరి (ప్రకాశం), టీ సుమతి (ప్రకాశం), కే స్వప్న (అనంతపురం), ఆర్ తనూజ (శ్రీకాకుళం), జీ భవాని (శ్రీకాకుళం), ఎస్ తేజశ్రీ (శ్రీకాకుళం), పి అర్చనశ్రీ (కర్నూలు), ప్రవంతి (కడప), బీ స్వాతి (తూర్పుగోదావరి), జీ అనిత (కృష్ణా), డీ లక్ష్మి (గుంటూరు), పీ జ్యోత్స్న (విశాఖపట్నం), సత్యవతి (చిత్తూరు), మణిచంద్రిక (తూర్పుగోదావరి).